ప్రజాశక్తి
శుక్రవారం 14 మార్చి 2025 5 విజయనగరం



సంకల్పానికి స్కాచ్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాదక ద్రవ్యాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసులు చేపట్టిన సంకల్పం కార్యక్రమానికి ప్రతిష్టాత్మకమైన స్కాచ్ అవార్డు లభించింది. మాదక ద్రవ్యాల నియంత్రణకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలను, సంకల్పం కార్యక్రమం ఇస్తున్న ఫలితాలను క్షేత్రస్థాయిలో స్కాచ్ గ్రూపు పరిశీలించి స్కాచ్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పోలీసులు డ్రగ్స్ నియంత్రణకు చేపడుతున్న చర్యలను పరిశీలించినట్లు చెప్పారు. చివరికి విజయనగరం జిల్లా పోలీసుశాఖ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాలతో సంతృప్తి చెంది, ప్రతిష్టాత్మకమైన స్కాచ్ అవార్డుకు ఎంపిక చేశారని వెల్లడించారు.

ఈసారైనా దక్కేనా?

- నాగార్జున, గొంపలకు వరించని ఎమ్మెల్సీ పదవులు
- త్వరలో నియమించే నామినేటెడ్ పదవులపై ఆశలు



గొంప క్రిష్ణ



కిమిడి నాగార్జున

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించి భంగపడినవారికి ఒకొక్కరికి అధికార పార్టీ (టిడిపి) నామినేటెడ్ పదవులు కల్పిస్తోంది. కానీ, సీటు కోసం ఎందాకైనా రెడీ అన్నట్టుగా వ్యవహరించి, చివరకు అధిష్టానం ఒత్తిడి, స్పష్టమైన హామీలతో వెనక్కి తగ్గిన టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, అ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణకు మాత్రం ఇప్పటి వరకు పదవులు దక్కలేదు. జిల్లా పార్టీలో అత్యంత కీలకంగా వున్న ఈ ఇద్దరూ కక్కలేక మింగలేక అన్నట్టుగా లోలోప మదనపడుతున్నారని వారి అనుచరులు చెప్పుకుంటున్నారు. వాస్తవానికి గడిచిన ఎన్నికలకు ముందు నుంచే వీరిద్దరూ పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. ముఖ్యంగా నాగార్జున జిల్లా పార్టీ బాధ్యతలు చూస్తూనే చీపురుపల్లిలో చురుకైన పాత్ర పోషించారు. నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా శక్తిమేర పనిచేయడంతో గత ఎన్నికల్లో సీటు ఆయనకు ఖాయం అనే వాతావరణం కూడా కనిపించింది. చివరకు చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు కోసం నాగార్జునను పక్కనబెట్టారు. అప్పట్లో తీవ్ర నిరాశ, మనస్థాపం చెందిన 'నాగార్జున యువత రాజకీయాల్లోకి రావొద్దు' అంటూ స్టేట్‌మెంట్లు కూడా ఇచ్చారు. ఆయనకు సీటు ఇవ్వాలంటూ చీపురుపల్లిలో భారీ ర్యాలీలు కూడా జరిగాయి. చివరకు పార్టీ నేత లోకేష్ జోక్యంతో నాగార్జున ఒక్క అడుగు వెనక్కితగ్గి పార్టీ అధ్యక్షునిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అటు ఎస్.కోట టిక్కెట్ ఆశించిన గొంప కృష్ణ సీటు దక్కకపోవడంతో ఏకంగా స్వతంత్రంగా పోటీచేసేందుకు కూడా సిద్ధం అయ్యారు. ఇందుకనుగుణంగా భారీ భహిరంగ సభసైతం నిర్వహించడంతో అధిష్టానం రంగంలోకి దిగి బుజ్జగించింది. అధికారంలోకి రాగానే సముచిత స్థానం కల్పిస్తామంటూ అధినేత చంద్రబాబు సహా లోకేష్ కూడా హామీ ఇచ్చారు. దీంతో, వెనక్కి తగ్గడమే కాకుండా విశాఖ ఎంపీ భరత్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలను బట్టి పార్టీ గెలుపునకు కృషి చేశారనడంలో సందేహం లేదు. వీరితోపాటు నెల్లిమర్ల నియోజకవర్గంలో సీటు ఆశించిన కర్రోతు బంగార్రాజుకు కొన్నాళ్ల క్రితం మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఆయన ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆశించినప్పటికీ చైర్మన్ పదవి కట్టబెట్టారు. తాజాగా గ్రీష్మకు ఎమ్మెల్సీ సీటు ప్రకటించడంతో తనకు రాలేదన్న నిరాశతో బంగార్రాజు ఉన్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే, నాగార్జున, కృష్ణలకు ఇప్పటికీ పదవులు కట్టబెట్టకపోవడంతో జిల్లాలో సర్వత్రా చర్చనడుస్తోంది. ఎమ్మెల్సీ పదవులకు మించిన పదవులు ఇంకేముంటాయంటూ వారి అనుయాయుల నోట వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వీరిని అధిష్టానం పట్టించుకోవడం లేదని కొందరు అంటుంటే, సముచితమైన పదువులు ఇచ్చే ఆలోచనలో భాగంగానే సందర్భం కోసం పార్టీ ఎదురు చూస్తోందని మరికొందరు వాదిస్తున్నారు. ఎమ్మెల్సీ సీట్లు ఎలాగూ భర్తీ అయిపోతున్నాయి కాబట్టి త్వరలో అధిష్టానం ప్రకటించిన నామినేటెడ్ పదవులైనా వస్తాయన్న ఆశతో నాగార్జున, గొంపకృష్ణ ఎదురు చూస్తున్నారు. టిడిపి అధిష్టానం వీరి ఆశలను తుంచుతుందో, నెరవేరుస్తుందో వేచి చూడాల్సిందే.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నిర్వహించాలి

- పోలీస్ శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి
- డివైఎఫ్ఐ డిమాండ్
- కోట వద్ద ప్లకార్డులతో నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు, కానిస్టేబుల్ అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ డిమాండ్ చేశారు. గురువారం పోలీస్ కానిస్టేబుల్ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి కోట జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో 6100 పోస్టుల భర్తీకి పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్ విడుదల చేశారని, 2023 జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్షకు 4, 59,182 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో అర్హత సాధించిన 95 208 మందికి గత ఏడాది డిసెంబర్‌లో ఈవెంట్స్ నిర్వహించారని తెలిపారు. మెయిన్ ఎగ్జామ్ గురించి ఇంతవరకు ప్రభుత్వం నుండి ఎటువంటి సమాచారమూ ఇవ్వలేదన్నారు. సుమారు ఆరేళ్లగా అభ్యర్థులు రీడింగ్ రూముల్లోనూ, కోచింగ్ సెంటర్లలోనూ చదువుకుంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ వెంటనే మెయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, శివ, లక్ష్మణ, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాలకు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆదర్శ పాఠశాలలలో 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలో గల మోడల్ స్కూళ్లలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూప్ లలో ఉచిత విద్య పొందగోరు విద్యార్థులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, సమాచారం కోసం వెబ్ సైట్ https://apms.apcfss.inలో చూడాలని తెలిపారు. ఒసి, బిసి, ఇడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150 దరఖాస్తు ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు.

వైసిపి సమావేశానికి

అసమ్మతి కౌన్సిలర్లు డుమ్మా

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం తెరపైకి రావడంతో వైసిపి కౌన్సిలర్లతో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సమావేశం నిర్వహించారు. వైసిపి కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశానికి 9 మంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వైసిపికి ఉన్న 21 మంది కౌన్సిలర్లలో ఒకరు రాజీనామా చేశారు. 20 మంది కౌన్సిలర్లు ఉండగా, సమావేశానికి 11 మంది హాజరయ్యారు. గైర్హాజరైన కౌన్సిలర్లకు మాజీ ఎమ్మెల్యే శంబంగి ఫోన్ చేశారు. వేర్వేరు పనుల్లో ఉన్నామని రాలేమని, తర్వాత వచ్చి కలుస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు.

ఎంఆర్ కళాశాలలో 15న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మహారాజ (అటానమస్) డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా బి టెక్, ఎం.టెక్ , బిఎస్‌సి, బి.కామ్, బిబిఎ, ఎంబిఎ, బిసిఎ, ఎంసిఎ, ఎంఎస్‌సి డిగ్రీలలో 2023, 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించి వయస్సు 21 నుండి 26ఏళ్ల వయసు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 15న శనివారం ఉదయం 9 గంటల నుంచి ఎంఆర్ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, అడ్మిట్ కార్డు తో పాటుగా రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8099461303 లేదా టోల్ ఫ్రీ 9988853335లో సంప్రదించాలని తెలిపారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు వెబ్ ఆప్షన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి ఉచిత కోచింగ్‌కు ఎంపికైన ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ సర్వీస్ జ్ఞానభుమి, https://mdfc.apcfss.in సైట్‌లో పొందుపర్చినట్లు సాంఘిక సంక్షేమ అధికారి రామానందం తెలిపారవు. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 15లోపు వారి లాగిన్ లో (కోచింగ్ సెంటర్ పేరు ప్రాధాన్యత వారిగా) వెబ్ ఆప్షన్ ఇవాలని తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 743 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష కు మొత్తం 20,540 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 19797 మంది హాజరయ్యారు. 743 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు.

ఇప్పటికైనా మారండి

హెచ్‌ఎం స్వీయ క్రమశిక్షణ • విద్యార్థుల ఎదుట గుంజీలు తీసిన గురువు



గుంజీలు తీస్తున్న ప్రధానోపాధ్యాయులు రమణ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

గురువులు ఎంత ప్రయత్నిస్తున్నా విద్యార్థుల్లో మార్పు రాలేదంటూ గుంజీలు తీసి స్వీయ క్రమశిక్షణ విధించుకున్నారు ఓ ప్రధానోపాధ్యాయుడు. ఈ నెల 11న బొబ్బిలి మండలంలోని పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చోటుచేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విద్యాశాఖా మంత్రి లోకేష్ దృష్టికి వెళ్లింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

బొబ్బిలి మండలంలోని పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సుమారు 285 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో పదో తరగతి విద్యార్థులు 85 మంది ఉన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, అంతా మంచిగా చదవాలని, శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమణ శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. అయినా, విద్యార్థుల్లో మార్పు రాలేదు. దీంతో ఈ నెల 11న 'మీకు ఎలా చెబితే అర్థం అవుతుంది. మీలో మార్పు రావాలి' అంటూ సాష్టాంగ నమస్కారం చేసి, గుంజీలు తీసి వేడుకొన్నారు. ఇకనైనా మంచిగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని కోరుకున్నారు. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఈ ఘటనపై హెచ్‌ఎం రమణను వివరణ కోరగా, పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యా విషయాలపై ఎన్ని విధాలుగా చెప్పినప్పటికీ వినడం లేదన్నారు. దీంతో వారిలో మార్పు తీసుకువచ్చేందుకు స్వీయ క్రమశిక్షణ వేసుకొన్నానని తెలిపారు.

లోకేష్ అభినందన

పెంట పాఠశాలలో జరిగిన ఘటనపై ట్విట్టర్ వేదికగా విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించారు. 'హెడ్మాస్టరు గారూ! అంతా కలిసి పనిచేసి, ప్రోత్సాహం అందిస్తే మన ప్రభుత్వ పాఠశాలల పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారు. వారిని దండించకుండా అర్థం చేసుకునేలా మీ స్వీయ క్రమశిక్షణ చర్య ఆలోచన బాగుంది' అంటూ అభినందించారు. అందరం కలిసి విద్యాప్రమాణాలు పెంచుదామని, పిల్లల విద్య, శారీరక, మానసిక వికాసానికి కృషిచేసి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



శక్తి టీం సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ఆకతాయిల భరతం పట్టేందుకు శక్తి టీం

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో మహిళలపై దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు శక్తి బృందాలను నియమించామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి బృందాలతో ఎస్‌పి.. పోలీసు కార్యాలయంలో మమేకమై, వారు నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. శక్తి బృందాలు జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతాయని చెప్పారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలను ఏర్పాటుచేశామని తెలిపారు. ఒక్కొక్క బృందానికి ఎస్ఐ నాయకత్వం వహిస్తారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తాయని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ కోసం గతంలో ప్రత్యేకంగా కేటాయించిన ద్విచక్ర వాహనాలను, ఫోర్ వీలర్లను, పెట్రోలింగ్ వాహనాలను వినియోగించాలన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఒఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్‌తో సంఘటన స్థలానికి ట్యాబ్‌లను కూడా తీసుకెళ్లాలని, బాడీ వార్న్ కెమెరాలను ధరించాలని సూచించారు.

మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఈ బృందాల పని తీరును జిల్లాలో ఎఎస్‌పి పి.సౌమ్యలత పర్యవేక్షిస్తారని, మహిళా పిఎస్ ఇన్‌స్పెక్టరు నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, మహిళా పిఎస్ సిఐ ఇ.నర్సింహమూర్తి, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, తదితరులు

తెలుగులో తొలి రచయిత్రి మొల్లమాంబ

కలెక్టర్ బిఆర్.అంబేద్కర్ • ఘనంగా మొల్లమాంబ జయంతి

ప్రజాశక్తి-విజయనగరం


తెలుగులో తొలి కావ్యం రచించిన రచయిత్రి మొల్లమాంబయని, ఆమె చరిత్ర భావితరాల వారికి తెలియజేయవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రముఖుల్ని స్మరించుకునేటప్పుడు వారి ఘనతను మాత్రమే మాట్లాడుకోవాలని, వారి కులాన్ని బట్టి గౌరం ఇవ్వకూడదని తెలిపారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతిని వెలిగించి, మొల్ల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల అనేక మంది ప్రముఖుల జయంతులు, వర్ధంతులు జరుపుకుంటూ వారిని స్మరించుకోవడం జరుగుతోందని, ఇతువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భావితరాలకు గొప్పవారి గురించి తెలియజేసిన వారం అవుతామని అన్నారు. మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ 16వ శతాబ్దం లోనే 881 పద్యాలు 5 రోజుల్లో రాసిన మొల్లమాంబ రామాయణాన్నే కాకుండా కుల వివక్షపై అనేక పుస్తకాలు రాసారని పేర్కొన్నారు. శాలివాహన కులానికి చెందిన ప్రతినిధులు మొల్లమాంబ జీవిత చరిత్ర పై ప్రసంగించారు. సమావేశంలో ఇంఛార్జి జెసి డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి పెంటోజి రావు , డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, కొప్పళ వెలమ రాష్ట్ర డైరెక్టర్ కొల్లి అప్పల నాయుడు, బి.సి కార్పొరేషన్ అధికారులు, సంక్షేమ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు కబడ్డీ జట్టు పయనం

విజయనగరం టౌన్ : కడప జిల్లా పులివెందులలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా బాల బాలికల జట్లు గురువారం పయనమయ్యాయి. రాష్ట్ర విజేతగా విజయం సాధించాలని జిల్లా కబడ్డీ సంఘ చైర్మన్ ఐవిపి రాజు , కార్యదర్శి కెవి ప్రభావతి, అధ్యక్షులు రంగారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణ్ రావు ఆకాంక్షించారు.

పేదలకు నివాసమున్నచోట పట్టాలివ్వాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు



పూల్‌బాగ్ వాసులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 30 ప్రకారం పూల్ బాగ్ పిజి కాలేజి ఎదురుగా 30ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లకు 2 సెంట్లు ఉచితంగా రెగ్యులర్ చేసి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా గురువారం పూల్‌బాగ్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలు తెలిపారు. అనంతరం శంకర్రావు మాట్లాడుతూ పేదల కోసం తెచ్చిన జీవోను పెద్దల ఉపయోగించు కోకుండా చూడాలని ఆయన కోరారు. పేదలు నివసించే ప్రాంతాల్లో పక్కగా రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాంధీ, ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీడి పంటకు మద్దతుధర ప్రకటించాలి

వేపాడ : జీడి పంట 80 కిలోల బస్తాకు రూ.16 వేలుగా మద్దతుధర నిర్ణయించి, ఐటిడిఎ, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం మండలంలోని కెజిపూడి, కరకవలస, జాకేరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. జీడి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో జిసిసి ద్వారా జీడి పంట కొనేవారని, ఇప్పుడు కొనుకోలు చేయకపోవడం వల్ల దళారులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడికి ప్రభుత్వం మద్దతుధర ప్రకటించాలని డిమాండ్‌చేశారు. ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు జీడి రైతులు తరలిరావాలని కోరారు.

సురక్షితంగా డ్రైవింగ్ చేయాలి

- రహదారి భద్రత నియమాలను పాటించాలి
- డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించిన కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

డ్రైవింగ్ నేర్చుకున్న వారంతా సురక్షితంగా డ్రైవింగ్ చేయాలని, రహదారి భద్రత కోసం అమలులో నున్న నియమాలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ .అంబేద్కర్ తెలిపారు. జిఎంఆర్ సంస్థ సిఎస్ఆర్ కింద భోగాపురం మండలం గూడెపువలస, ఆర్ అండ్ ఆర్ కాలనీలకు చెందిన యువతకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లో నెల రోజుల పాటు 50 మంది యువకులకు శిక్షణ ఇచ్చింది. శిక్షణ పొందిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గురువారం ఆయన ఛాంబర్ లో సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ పొందిన వారంతా స్వయం ఉపాధి అవకాశాలను పొందాలని తెలిపారు. శిక్షణ లో డ్రైవింగ్ తో పాటు వాహన మరమ్మత్తులు , లీగల్ అంశాలు, రహదారి భారత , సైకాలజీ తదితర అంశాల పై కూడా శిక్షణ ఇచ్చినట్లు జిఎంఆర్ ప్రోగ్రాం మేనేజర్ నాగరాజు కలెక్టర్ కు తెలిపారు. కార్యక్రమంలో మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఎఎల్‌డిఎం వైడి ప్రత్యూష పాల్గొన్నారు.

తాటిపూడి పర్యాటకాభివృద్ధికి

రూ.23 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి-విజయనగరం

గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం వద్ద ఎకో టూరిజం అభివృద్ధి లో భాగంగా 23 కోట్ల తో ప్రతిపాదనలు పంపినట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రోప్ వే నిర్మాణం , జలాశయానికి రెండు వైపులా కేబుల్ అండ్ సస్పెన్షన్ వంతెన ను నిర్మించడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రిక్రియేషన్ కోసం చిల్డ్రెన్ పార్క్ , బర్డ్స్ పార్క్ , రెస్టారెంట్ అండ్ క్లబ్ హౌస్ , ఓపెన్ ఎయిర్ ఆంఫీ థియేటర్ తదితర పనుల కోసం పర్యాటక శాఖ కు ఇప్పటికే 10.63 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. పర్యాటకుల వసతి సదుపాయం కోసం ప్రస్తుతం ఉన్న కాటేజ్ లను ఆధునీకరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రెడ్డికంచేరులో పోలీసు అవుట్‌పోస్ట్

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో రెడ్డికంచేరు గ్రామంలో ఏర్పాటుచేసిన పోలీసు అవుట్ పోస్టును గురువారం ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్ పోర్టు నిర్మాణ పనులకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వర్కర్లు, స్థానికుల మధ్య విభేదాలు తలెత్తకుండా, పోలీసు సేవలు అందుబాటులో ఉండే విధంగా అవుట్ పోస్టు ఏర్పాటు చేశామని చెప్పారు. జిఎంఆర్, ఎల్‌అండ్‌టి సంస్థల సహకారంతో పెట్రోలింగ్ వాహనం, పోలీసు అవుట్ పోస్టు కూడా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిఎంఆర్ గ్రూపు వైస్ ప్రెసిడెంట్ రామరాజు, సిడిఒ ఎం.కోటేశ్వరరావు, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ ఎన్.వి.ప్రభాకరరావు, ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.



పోలీసు అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఎస్‌పి వకుల్, చిత్రంలో జిఎంఆర్ వైస్ ప్రెసిడెంట్ రామరాజు

17న పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలపై ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి చెప్పారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని, డిఆర్, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషన్ నియామకంపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. హెల్త్ కార్డుపై వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, బొబ్బిలిలో జరిగే నిరసనకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శాస్త్రి, లక్ష్మినారాయణ, కోశాధికారి నాగరాజు హాజరవుతారని చెప్పారు. నిరసన అనంతరం నాయుడు కళ్యాణ మండపంలో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎల్.జగన్నాథం, పి.సత్యంనాయుడు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవస్థానం భూముల్లో అక్రమంగా విద్యుత్తు లైన్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దేవస్థానం భూముల్లో అక్రమంగా విద్యుత్ లైన్ వేస్తున్నారని వడికాని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గొర్లిపేటకు చెందిన ఎ.నారాయణరావు, పి.సూరిబాబు, పి.కృష్ణ, జి.అప్పలస్వామి విలేకర్ల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్లిపేట గ్రామానికి రెవెన్యూ లేదని దేవస్థానం భూముల్లో అక్రమంగా విద్యుత్ లైన్ వేస్తున్నారని అధికారులకు చెప్పినా విద్యుత్ ఎఇ అక్రమార్కులకు వత్తాసు పలికి పారం 3లో సర్వే నెంబర్ ఒకటి, బోరు ధర్గం ఇంకొక నెంబర్ వేసి దేవస్థానం భూముల్లో స్తంభాలు వేస్తున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి దేవస్థానం భూముల్లో లైన్ వేసిన వ్యక్తులు, సహకరించిన విద్యుత్ అధికార్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జెఎన్‌టియులో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సాంకేతిక సదస్సు 'క్రిసెన్స్ –2కె 25' గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ జి.జయసుమ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఇటువంటి సదస్సులు విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకునేందుకు ఉపయోగపడతాయని, విజ్ఞానాన్ని సృజనాత్మకంగా ఉపయోగించుకోవాలని కోరారు. ముఖ్య వక్తగా హాజరైన వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జికె నాగరాజు మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి క్రమంలో ఇటువంటి సదస్సుల ప్రాముఖ్యతను వివరించారు. సిఎస్ఇ విభాగ అధిపతి డాక్టర్ పి.అరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధుపాడ వాటర్ రిజర్వాయర్ నుంచి విజయనగరానికి నీటి పంపిణీ జరిపేందుకు 750 కెవి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల కారణంగా నగరంలో కొన్నిచోట్ల గురువారం, శుక్రవారం తాగునీరు పంపిణీకి అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 30,35, 36, 38, 39, 40, 45, 46, 47 డివిజన్లలో పూర్తిగా, 41 44 డివిజన్లలో కొన్ని ప్రాంతాల్లో తాగునీరు పంపిణీకి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటి పంపిణీ చేపడతామన్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని రైల్వేస్టేషన్ నూతన భవనం వద్ద మున్సిపల్ పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. మల్లమ్మపేట ప్రజలకు తాగునీరు సరఫరా చేసే సబ్ పైపులైన్ లీకవడంతో సంపూర్ణంగా తాగునీరు అందడం లేదు. ఇదే ప్రాంతంలో పలుమార్లు పైపులైన్ లీకవుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి లీకులను నివారించాలని మల్లమ్మపేట ప్రజలు కోరుతున్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్‌టిసి శృంగవరపుకోట డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి, వారి నివాసం నుంచి పరీక్ష కేంద్రానికి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాల బాలికలకు నాంది ఫౌండేషన్ క్రీడా సామగ్రి పంపిణీ చేసింది. బాలికల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించడానికి నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నన్హికాళీ అనే ప్రాజెక్టు ద్వారా ఈ సామగ్రి అందజేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు, పిఇటిలు అనురాధ, ఛాయాదేవి పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురంలో గ్రామదేవత ముత్యాలమ్మ జాతర గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం 5 గంటల నుండి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. జాతర సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటుచేసిన బండ్ల వేషాలు ఆకట్టుకున్నాయి. సంగిడి రాళ్ల పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు. జాతర సందర్భంగా శుక్ర, శనివారాల్లో ఎడ్లు, గుర్రపు పరుగు పోటీలు నిర్వహిస్తున్నారు.

మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

విజయనగరం టౌన్ : వేసవి సెలవుల్లో చేపట్టబోయే ఉపాధ్యాయ బదిలీలను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాస్, రాంబాబు, బంకపల్లి శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఐచ్ఛింకంగా బదిలీ కోరుకున్న వారికి ఇబ్బంది లేదు కానీ, తప్పనిసరి బదిలీ ఉపాధ్యాయులు 1500 పాఠశాలలు వరకూ ఎంపిక నమోదు చెయ్యవలసి ఉంటుందని, ఇన్ని పాఠశాలలు ఆన్‌లైన్‌లో ఎంపిక చేయడమంటే కష్టతరమని తెలిపారు. కావున ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈ నెల 15న మండలంలోని అన్ని పంచాయతీల్లో చేపట్టనున్న స్వర్ణంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పి.కుర్మినాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్‌ను నిషేదించాలని దీనిపై గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు, తహశీల్దార్ సుదర్శన్ ఇఒపిఆర్‌డి శంకర జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కెఆర్ పురంలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నీలకంఠరాజపురం అగ్రహారం గ్రామంలో వేరుశనగ పంట ప్రయోగాన్ని ఎఎస్‌ఒ రామకృష్ణంరాజు, ఎఒ యశ్వంత్ ఆధ్వర్యాన గురువారం చేపట్టారు. 5X5 విస్తీర్ణంలో 8.25 కిలోలు దిగుబడి వచ్చిందని ఎఒ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కెవి తోటపాలెం సబ్ స్టేషన్, విటి అగ్రహారం పరిధిలో చెట్లు కొమ్మలను తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్తుశాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. బ్యాంక్ కాలనీ, శ్రీరామ్ నగర్, గోపాల్ నగర్, ఇందిరా నగర్, నాగోజీపేట , రైల్వే స్టేషన్ రోడ్, బొత్స పేట, సెంట్రల్ బ్యాంక్ ఏరియా, తిరుమల హాస్పిటల్ ఏరియా, ఆర్టీసి కాంప్లెక్స్ ఏరియా , బాలాజీ నగర్, నాయుడు కాలనీ, సాయి నగర్, నరసింహ నగర్, సిద్దార్థ నగర్, విటి అగ్రహారం, బిసి కాలనీకి విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు.

భవిష్యత్తులో డ్రోన్లదే కీలకపాత్ర

ప్రజాశక్తి - నెల్లిమర్ల

భవిష్యత్‌లో డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నాయని ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ అనీల్ కుమార్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తొన్న వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్ ఎంపవరింగ్ స్కిల్స్ త్రో డ్రోన్ టెక్నాలజీ అనే వర్క్ షాపు ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌లో ఉపాధి అవకాశాల గురించి వివరించారు. చీఫ్ పాట్రన్‌గా పాల్గొన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ రానున్న కాలంలో డ్రోన్లు ఏయే రంగాలలో ఉపయోగించడానికి అవకాశం ఉందో వివరించారు. గిరిజన ప్రాంతాలలో నేలల స్వభావం, నీటి వనరుల లభ్యత, ఆరోగ్యసేవలు అందించడంలో డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, డాక్టర్ బొంతు కోటయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సూపర్ బీ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తయారు చేస్తొన్న డ్రోన్ల తయారీ, పరిశోధన, డ్రోన్ల ప్రయోగం తదితర వాటిని తిలకించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్లుగా డాక్టర్ కె.లత, డాక్టర్ ప్రేమ చట్టర్జీ, డాక్టర్ ఎన్.వి.ఎస్.సూర్యనారాయణతోపాటు డాక్టర్ ఎం.జి.నాయుడు, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ ఎం.ప్రసాద్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డ్రోన్ల ఉపయోగాలను వివరిస్తున్న ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్

నూరు శాతం పన్నుల వసూళ్లే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తిపన్ను మొండి బకాయిలు వసూళ్ళకై నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఓవైపు, సహాయ కమిషనర్ కె.అప్పలరాజు మరోవైపు నగర వ్యాప్తంగా పర్యటిస్తూ మొండి బకాయిలను వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇన్నాళ్లు అడ్మిన్ కార్యదర్శులతోను, బిల్ కలెక్టర్లతోనూ, రెవిన్యూ ఇన్స్పెక్టర్లతోనూ మొండి బకాయిలను వసూలు చేసే బాధ్యతను కమిషనర్ పల్లి నల్లనయ్య వారికి అప్పగించారు. బకాయిలు వసూలుకై తరచూ వారంతా వెళ్లినప్పటికీ బకాయిదారులు పెడచెవిన పెట్టారు. దీంతో పన్ను బకాయిలు లక్షల్లో చేరుకున్నాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉన్నతాధికారులు వెళ్లడంతో కొంతమంది నగదు రూపంలో మరి కొంతమంది చెక్కుల రూపాయల బకాయిలను అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రజలు చెల్లించే పన్నులే ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలన్నారు. గత నెల రోజులుగా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, బృందాలను ఏర్పాటు చేసి పన్ను వసూళ్ళను మమ్మరం చేస్తున్నామన్నారు. బకాయిదారులందరూ తమ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, నీటిఛార్జీలు, ట్రేడ్ లైసెన్సులను తక్షణమే చెల్లించి సహకరించాలని కోరారు.



పన్నుల వసూలుకు సిబ్బందితో వెళ్లిన కమిషనర్

రూ.32 లక్షలు చెల్లించిన ఖాళీ స్థలం యాజమాని

నగరానికి చెందిన ఓ ప్రముఖ డెవలపింగ్ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖాళీ స్థలం పన్నును అధిక మొత్తంలో 32,85,000 రూపాయలను కమిషనర్ కు చెక్కు రూపంలో చెల్లించారు.

ప్రయివేట్ ట్యాంకర్లకు నీరు ఇవ్వకండి

ప్రజాశక్తి-బొబ్బిలి

వేసవిలో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయలేని మున్సిపల్ అధికారులు.. ప్రయివేట్ వాటర్ ట్యాంకర్లకు నీరు ఎలా ఇస్తారని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ ప్రశ్నించారు. మున్సిపల్ వాటర్ ట్యాంకు వద్ద ప్రయివేట్ ట్యాంకర్‌కు నీరు పట్టడాన్ని గురువారం ఆయన పరిశీలించారు. వేసవిలో సంపూర్ణంగా తాగునీరు ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే ప్రయివేట్ ట్యాంకర్లకు వాటర్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు.

డిడితోనే ప్రైవేట్ ట్యాంకర్లకు నీరు

ప్రైవేట్ ట్యాంకర్లతో డిడి కట్టించుకుని నీరు ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ రూ. వెయ్యి డిడి రూపంలో చెల్లించడంతో వాటర్ ఇచ్చినట్లు చెప్పారు. ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు ఇచ్చిన తర్వాత ట్యాంకర్లకు ఇస్తున్నామని చెప్పారు.

రూ.1.23 కోట్లు పన్నుల వసూలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఈ నెల 13 నాటికి రూ.1.23కోట్లు పన్ను వసూలు చేశామని కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ప్రైవేట్ ప్రోపర్టీలకు సంబందించి ఆస్థి పన్ను డిమాండు రూ.1.48 కోట్లు కాగా ఇప్పటి వరకూ రూ.1.23 కోట్లు వసూలు చేశామన్నారు. ఇంకా రూ.25 లక్షలు వసూలు చేస్తామని, నీటి ఛార్జీలు రూ.33.57లక్షలకు రూ.10.59లక్షలు వసూలు కాగా రూ.22.98 బకాయిలు ఉన్నాయన్నారు. ఖాళీ స్థలం పన్నులు రూ.6.58లక్షలకు రూ.4.27లక్షలు వసూలు కాగా రూ.2.31 లక్షలు బాకాయిలు ఉన్నాయని తెలిపారు. ఇంటి యజమానులు ఈ ఆర్థిక సంవత్సరం మరో 15 రోజుల్లో ముగిస్తున్నందున నగర పంచాయతీకి చెల్లించవలసిన ఆస్థి పన్ను, నీటి ఛార్జీలు, ఖాళీ స్థలం పన్నులు బకాయిలు చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

మెకట్రానిక్స్‌లో ఉద్యోగాలకు జర్మనీలో శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

ఆసక్తిగల యువతకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెకట్రానిక్స్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు జర్మనీలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. '2కామ్స్' సంస్థతో కలిసి ఎపిఎస్‌సి ఈ శిక్షణను నిర్వహిస్తోందని తెలిపారు. స్కిల్డ్ మెకాట్రానిక్స్ జాబ్ కోసం డిగ్రీ/డిప్లొమా ఇన్ మెకాట్రానిక్స్/ఎలక్ట్రికల్/ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన 18 నుంచి 40ఏళ్ల వయసు వారు సంబంధిత శాఖలో కనీసం 3ఏళ్ల అనుభవం గల స్త్రీ పురుష అభ్యర్థులకు 6 నెలలపాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎ1, ఎ2, బి1, వీసా ప్రాసెసింగ్ కు సంబంధించిన శిక్షణ ఇచ్చి నెలకు రూ.2800 నుంచి రూ.3600 యూరోలు (2,52,658 నుంచి 3,24,846) జీతంతో ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తారని తెలిపారు. వీసా, ఫ్లైట్ ఛార్జీలు, ఇన్సూరెన్సు సంస్థ వారు భరిస్తారని తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 25లోపు https://naipunyam.ap.gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నైపుణ్యశిక్షణ విశాఖపట్నం, విజయవాడల్లో నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 9492927844 నెంబరును సంప్రదించాలని తెలిపారు.



సభలో మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

సమాజాభివృద్ధిలో మహిళలే కీలకం
డిఎస్‌పి భవ్య రెడ్డి

ప్రజాశక్తి-బాడంగి

సమాజ అభివృద్ధిలో మహిళలే కీలకమని డిఎస్‌పి భవ్యరెడ్డి తెలిపారు. బాడంగి సమీపంలోని దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ సిఇఒ ఎల్.శాంతి ఆధ్వర్యాన నాబార్డు డిడిఎం టి.నాగార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఎస్‌పి మాట్లాడారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మహిళలు ఎదుగుతున్నారని చెప్పారు. కుటుంబంతో పాటు సమాజాన్ని అన్ని విధాలా క్రమశిక్షణతో ముందుకు నడపడంలో మహిళల ప్రాధాన్యత అధికమని తెలిపారు. నాబార్డు డిడిఎం నాగార్జున మాట్లాడుతూ మహిళలు అన్ని విధాలా అభివృద్ధి చెందినప్పుడే దేశం, కుటుంబం బాగుపడతాయన్నారు. జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డి.పారినాయుడు, ఎఒ శిరీషా, ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావు, ఏకలవ్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలవలస గౌరు మాట్లాడారు. ఈ సందర్భంగా డిఎస్‌పి భవ్యరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ హారిక, డాక్టర్ ప్రత్యూష, బ్యాంకు ఉద్యోగి ప్రజ్ఞ, అక్షయ సిఇఒ లక్ష్మి పద్మ పార్వతి, ఎస్‌ఐ తారకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నాడు ఉన్నత విద్యకు దూరం చేసి.. నేడు ధర్నాలా?
టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి- చీపురుపల్లి

నాడు విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసిన వైసిపి నేడు ఉనికి కోసం విద్యార్థుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లిలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ రద్దు చేయలేదా అని ప్రశ్నించారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. చిక్కీలు, నోట్ పుస్తకాలపై జగన్ ఫోటోలు పెట్టి ప్రచార ఆర్భాటం చేసుకోలేదా అని వైసిపి నేతలను ప్రశ్నించారు. ఉనికిని కాపాడుకోవడానికి వైసిపి యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించిందని నాగార్జున ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టించి ఇప్పుడు ధర్నాలు చేయడంతో ప్రజలు నవ్వుకుంటున్నా రన్నారన్నారు. వైసిపి ప్రభుత్వ పాలకులు జీవోలు ఇచ్చి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వలేదు అనేది నిజం కాదా, ధర్నాలు చేస్తున్న వైసిపి నేతలు ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించకుండా ఉంచేసిన బకాయిలను విడతల వారీగా కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. విద్యాలయాలలో పార్టీ రంగులకు అతీతంగా విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు, యూనిఫారాలను సరఫరా చేయడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారన్నారు. వైసిపిని ప్రజలు మర్చి పోతుండడంతో ఆ పార్టీ నాయకులు హడావిడిగా ధర్నాలు పేరుతో రోడ్డు ఎక్కుతున్నారన్నారని విమర్శించారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఈ నెల 17 నుంచి జరగబోవు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఇఒలు ఎం.చంద్రశేఖర్, టి.ధర్మశ్రీను అన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలం నుంచి 627 మంది రెగ్యులర్ విద్యార్థులు, 6 గురు ప్రైవేట్ విద్యార్థులు, మొత్తం 633 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తారన్నారు. మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 168 రెగ్యులర్ విద్యార్థులు, 6 గురు ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. గర్భాం ఆదర్శపాఠశాల పరీక్షా కేంద్రంలో 199 మంది, మెరకముడిదాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల కేంద్రంలో 260 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలు వద్ద మెడికల్ కిట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. పరీక్షలకు ఎటువంటి అవాంతరం జరుగకుండా పరీక్ష కేంద్రాలకు 100 మీటర్లు వరకు 144 సెక్షన్ ఉంటుందని చెప్పారు.



జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్లపరుగు పందేలు

ఘనంగా బంగారమ్మతల్లి పండగ

ప్రజాశక్తి - డెంకాడ

మండల కేంద్రంలోని బంగారమ్మతల్లి 21వ వార్షికోత్సవ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నదానం కమిటీ సభ్యులు నిర్వహించారు. అనంతరం ఎడ్ల బండ్ల పరుగు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు 14 ఎడ్ల బళ్ళు పాల్గొని తలబడ్డాయి. వీటిలో సామాలమ్మతల్లి చుక్కపల్లి గ్రామానికి చెందిన ఎడ్లబండకు ప్రథమ బహుమతి రాగా రూ.20వేలు నగదు బహుమతి అందజేశారు. రెండవ బహుమతి జై వీరాంజనేయ దేవరపల్లి గ్రామానికి చెందిన బండికి వచ్చింది. మూడవ స్థానంలో వల్లంపూడి గ్రామానికి చెందిన ఏరువాక సత్తిబాబుకు, నాలుగవ బహుమతి పైడితల్లమ్మ తల్లి ఎక్కలవాని పాలెంకు 5వ స్థానం పరదేశమ్మ తల్లి వావలపాడుకు వచ్చింది. వీరికి పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, టిడిపి పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రెటరీ కలిదిండి పాణిరాజు, ఎస్‌ఐ ఏ సన్యాసినాయుడు, గ్రామ పెద్దల చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బంగారమ్మ తల్లి కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సహాయం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని ఉత్తరావల్లిలో అగ్ని ప్రమాద బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన వంట సామాన్లు బాక్స్, తార్పాన్ ,రగ్గు అందజేశారు. మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమారి చేతుల మీదుగా అగ్ని ప్రమాద బాధితులకు అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం రాము, సిహెచ్ మన్మధరావు, గ్రామ పెద్దలు మండల రామ్మోహన్‌రావు (చంటి), కర్రి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు

ఆత్మహత్యాయత్నం నుంచి యువకుడ్ని రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి- విజయనగరంకోట

ఆత్మహత్యాయత్నంకు పాల్పడతానని సూసైడ్ నోట్ రాసిన కేరళ యువకుడు విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ (21) ఆచూకీని మంగళవారం రాత్రి 9గంటల సమయంలో విజయనగరంలో గుర్తించి, యువకుడికి వన్‌టౌన్ పోలీసులు కాపాడారు. ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపిన వివరాలు ప్రకారం..

విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ బిఎస్‌సి నర్సింగు చదువుకొని, కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక యువతితో పరిచయం ఏర్పడి, ఆమెను గాఢంగా ప్రేమించాడు. కాలక్రమంలో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తడంతో, యువకుడి ఫోను నంబరును సదరు యువతి బ్లాక్ చేయడంతో, మనస్తాపం చెందాడు. ఈ ఘటన నుంచి సదరు యువకుడు బయటపడలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు, తన డెడ్ బాడీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరంలో ట్రేస్ చేసుకోవచ్చుని సూసైడ్ లెటరు రాసి, సోషల్ మీడియాలో పోస్టు చేసాడు. ఈ పోస్టుతో అప్రమత్తమైన సదరు యువకుని బంధువులు, స్నేహితులు సదరు విషయాన్ని ఎస్‌పి దృష్టికి ఫోన్‌లో తెలిపారు. యువకుడి ఆచూకీ కనిపెట్టి, రక్షించే చర్యలు చేపట్టాలని వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్‌ను ఎస్‌పి ఆదేశించారు.

యువకుడి ఆచూకీ కనిపెట్టేందుకు రంగంలో దిగిన వన్ టౌన్ పోలీసులు సాంకేతికతను వినియోగించి విశాఖపట్నం, చీపురుపల్లి, విజయనగరం పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో గాలించి, చివరికి యువకుడి ఆచూకీని విజయనగరం రైల్వే స్టేషనులో మార్చి 11న రాత్రి కనుగొన్నారు. యువకుడ్ని విజయనగరం 1టౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగు నిర్వహించి, వారి బంధువులకు సమాచారం అందించారు. యువకుడి బంధువులు గురువారం రావడంతో డిఎస్‌పి శ్రీనివాసరావు సమక్షంలో అప్పగించారు. జీవితం చాలా విలువైనదని, జీవితంలో ఏర్పడిన స్వల్ప వివాదాల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు సరికాదని, ఉన్నత లక్ష్యం ఏర్పరుచుకొని, లక్ష్య సాధనకు కషి చేయాలని పోలీసులు యువకుడు విష్ణు కెపికి హితబోధ చేశారు. సకాలంలో స్పందించి, యువకుడి ఆచూకీ కనిపెట్టి, ఆత్మహత్య ఆలోచనల నుండి కాపాడిన వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్‌ను, సిబ్బందిని డిఎస్‌పితో పాటు ఎస్‌పి అభినందించారు.



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి

ప్రజాశక్తి-భోగాపురం

విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకోవాలని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చెరుకుపల్లి లోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బియాండ్ ఇన్నోవేటివ్ 2కె25 ఏకతాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగాలు సాధించాలనే పట్టుదల ఉండాలని అన్నారు. అలాగే రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని ఏలుతుందని అన్నారు. అంతేకాక ప్రతి రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలు అవసరమవుతాయని అన్నారు. అనంతపుర విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మురళీకష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ బివి రాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కబేళాలపై మెరుపు దాడి
సబ్బవరం జెఆర్ఎస్ గోడౌన్‌లో పట్టుకున్న పశువుల వాహనం
రెండు ప్రాంతాల్లో 156 పశువులు స్వాధీనం

ప్రజాశకి-కొత్తవలస

సంతపాలెంలో పశువుల అక్రమ రవాణాపై గత వారంలోనే 202 పశువులను పట్టుకున్న విషయం మరవకముందే తాజాగా సంతపాలెం పంచాయతీ పరిధిలో ఓ ప్రాంతంలో 28 పశువులు ఇంకో ప్రాంతంలో 80 పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని కబేళాలకు తరలించినట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లేసరికి ముందుగానే గమనించిన పశువుల వ్యాపారస్తులు అక్కడ నుంచి ఉడాయించారు. సబ్బవరం మండలం గుల్లిపెల్లి పంచాయతీ పరిధిలో జె.ఆర్.ఎస్ గోడౌన్‌లో మరో 48 పశువులు అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్నాయన్న విజయనగరం టాస్క్‌ఫోర్సు అధికారులకు అందిన పక్కా సమాచారం మేరకు దాడులు చేసి పశువులను స్వాధీన చేసుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కొత్తవలస సిఐ షణ్ముఖరావు , సబ్బవరం సిఐ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట


మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లు, పరీక్షా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. తెలుగు అధ్యాపకులు రహీమ్ షేక్ లాల్ తన తల్లి నూర్జహాన్ బేగం జ్ఞాపకార్థం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్, స్కేల్, హాల్ టికెట్ కవర్ తదితర సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శివరామకృష్ణ, పాల్గొన్నారు.

వేపాడ : సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కిట్లను అందజేశారు. గ్రామస్తులు చింతల గోవింద్, చింతల గోపి, పి.కాళేశ్వరరావు ఈ కిట్లను సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బిపిఎ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు
మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-వేపాడ

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ.. అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో శనివారం గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ జె.రాములమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, ఎంఇఒ పి.బాల భాస్కరరావు, పిఆర్ జెఇ ఆలీ, ఎఒ యశ్వంత్, ఎపిఎం తదితరులు పాల్గొన్నారు,



అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ